క్లుప్తంగా

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన రవిచంద్ర



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఎ.రవిచంద్ర గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని పేర్కొన్నారు.

సాగునీటి చెరువు గండి పూడ్చాలి



పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రికలో సాగునీటి చెరువుకు పడిన గండిని పూడ్చాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు. విలేజి కండ్రిక ఆర్బీకే వద్ద గురువారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. గొల్లపూడి సబ్‌లిఫ్ట్‌కు రిపేర్లు చేసి పూర్తిస్థాయిలో రైతులకు ఉపయోగ పడే విధంగా చూడాలని కోరారు. వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అందించిన సహాయం పెంచాలన్నారు. ఎంటీయూ 1121 వరి విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ బి.రంగనాథ్‌బాబు, ఏఈఓ సురేష్, యరగొర్ల శ్రీరాములు, వ్యవసాయ సహాయకులు అక్షయ్, వెటర్నరీ అసిస్టెంట్ జయశ్రీ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాల్లోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు 726 మంది మొదటి రోజు దసరా ఉత్సవాలలో సేవలు అందించారని ఎన్టీఆర్ జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో క్యూలైన్ల నియంత్రణ, మంచినీటి సరఫరా, దివ్యాంగులకు సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, భోజనాలు వితరణలో సహాయం, ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ లో సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఒక్కొక్క బ్యాచ్‌కు 250 మంది చొప్పున మూడు షిఫ్ట్‌ల్లో సేవలందించారని చెప్పారు. పోలీసు బందోబస్తు సేవలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఉత్సాహంగా పని చేశారన్నారు. వలంటీర్లను సైబర్ క్రైమ్ సీఐ జానకి రామయ్య, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ యుగంధర్, వివిధ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు సమన్వయం చేశారని తెలిపారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశానికి సేవ చేయాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు దేశానికి సేవ చేయాలని దిశ స్వచ్ఛంద సంస్థ సభ్యులు డాక్టర్ సురేష్, అమూల్య సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని దిశ స్టూడెంట్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కేవీ శాంతకుమారి, డాక్టర్ రాధిక, సంస్థ సభ్యులు టోనీ, తాజుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధునికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో వృద్ధుడు గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భానునగర్‌కు చెందిన పేకేటి సత్యనారాయణ తండ్రి తాతారావు(75) బుధవారం రాత్రి బీఆర్టీఎస్ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన తాతారావును ఆస్పత్రికి తరలించారు. సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




శ్రీ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా..



జీవీఆర్ నగర్‌లో పూజలందుకుంటున్న అమ్మవారు



అంకమ్మతల్లి శక్తి పీఠంలో విశేష అలంకరణలో అమ్మవారు



రామలింగేశ్వరపేటలో పర్వత వర్ధినీదేవిగా అమ్మవారు



శ్రీశ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో..



శ్రీ బాలా త్రిపురసుందరీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

- తొలి రోజు శ్రీబాలా త్రిపురసుందరీదేవిగా దర్శనం
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గ వ్యాప్తంగా శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక అయోధ్యనగర్, రామలింగేశ్వరపేట, మధురానగర్, ముత్యాలంపాడు, దేవీనగర్, గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, రామకృష్ణాపురం, మాచవరం, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తొలి రోజు శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు.

పలు ఆలయాల్లో..

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్‌లో శివకామేశ్వరీ అమ్మవారిని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ లోక కళ్యాణార్థ పిఠాపురానికి చెందిన వేదపండితులచే విశేషంగా హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. నీలకంఠేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాలను వరప్రసాద్ పర్యవేక్షించారు. రామలింగేశ్వరపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయంలో అమ్మవారిని శ్రీపర్వతి వర్ధినీదేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు తాన్న పూర్ణచంద్రరావు, ఎస్.లక్ష్మీనరసారెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. స్థానిక ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో అమ్మవారు స్వర్ణాలంకృత కనకదుర్గాదేవిగా అలంకరించారు. గద్దె వెంకట్రామయ్యనగర్‌లో దేవుని మండపం వద్ద భక్త బృందం ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీబాల త్రిపుర సుందరీదేవిగా అలంకరణ చేసి, కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను గద్దె శ్రీను, నూతక్కి శ్రీను పర్యవేక్షించారు. దావు బుచ్చయ్య కాలనీ శ్రీశ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో విశేష పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు పర్యవేక్షించారు. మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీఅంకమ్మతల్లి శక్తి పీఠంలో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీ రావు పర్యవేక్షించారు. మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని శ్రీబాలా త్రిపురసుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. మధురానగర్‌లో స్వయంభూ శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవాలయంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, సామూహిక కుంకుమార్చలను నిర్వహించారు.



ముత్యాలంపాడులో

జగన్మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

పాయకాపురం(విజయవాడరూరల్): జగన్మాత దివ్య ఆశీస్సులు నియోజకవర్గంలో ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా విలేజి కండ్రికలో యాదవ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో విష్ణు పాల్గొన్నారు. శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజ నిర్వహించారు. జగన్మాత చల్లని దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం, సుఖ శాంతులు, సిరి సంపదలు చేకూరాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, నాయకులు యరగొర్ల శ్రీరాములు, సాదం శ్రీనివాసరావు, సాదం వెంకటేశ్వరరావు, మండవ రమేష్ తదితరులు ఉన్నారు.



విలేజ కండ్రికలో అమ్మ వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

బాలా త్రిపుర సుందరీదేవి నమోస్తుతే..!

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): శ్రీబాలా త్రిపుర సుందరీదేవీ.. నమోస్తుతే.. అంటూ భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. భక్తులు కుటుంబ సమేతంగా తెల్లవారుజాము నుంచే ఆలయాలకు విచ్చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, ఆంధ్రప్రభకాలనీ, వాంబేకాలనీ, పీఅండ్‌టీ కాలనీ పరిసర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలన్నీ దసరా శోభతో దర్శనమిచ్చాయి. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో వేంచేసి ఉన్న శ్రీకాశీ అన్నపూర్ణాదేవి ఆలయంలో అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ సాయి ప్రభసేవా ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులను తీర్థప్రసాదాలు అందజేశారు.

సూర్యారావుపేటలో ఉత్సవాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సూర్యనారాయణ వీధిలో స్వర్ణ ప్రభ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ విజయ కనకదుర్గాంబ దేవి నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని బాలాత్రిపురా సుందరీదేవిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి వేడుకల్లో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రంగ, కృష్ణారెడ్డి, తాండవ శ్రీనివాసరావు, రవి తదితరులు పాల్గొన్నారు.



శ్రీబాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో అమ్మవారు

శివరామకృష్ణ క్షేత్రంలో..



శృంగేరీ శారదాపీఠంలో శారదాంబ

విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని శివ రామకృష్ణ క్షేత్రంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జగద్గురువు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర మహాస్వామి ఆదేశాలతో పీఠ సంప్రదాయాన్ని అనుసరించి ఆదిపరాశక్తిని హంస వాహనంపై అలంకరించారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పర్యవేక్షించారు.

గౌతంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

మధురానగర్(విజయవాడసెంట్రల్): రానున్న ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ పూనూరు గౌతంరెడ్డిని గెలిపించుకునేందుకు ప్రజా ప్రతినిధులందరూ కష్టపడి పనిచేయాలని పార్టీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, యువతను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టిగా బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 6 లోపు నియోజకవర్గవ్యాప్తంగా క్యాంపులు నిర్వహించాలని.. ప్రతి డివిజన్ లోనూ 300 మంది పట్టభద్రులను గుర్తించి ఓట్లు నమోదు చేయించాలని సూచించారు. కార్పొరేటర్ శర్వాణి మూర్తి, నాయకులు యరగొర్ల శ్రీరాములు, అలంపూర్ విజయ్, కుక్కల రమేష్, కొండా మహేశ్వర్‌రెడ్డి, ఒగ్గు గవాస్కర్, ఎస్.హరిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గౌతంరెడ్డిని సత్కరిస్తున్న మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా తదితరులు

వరద బాధితులకు సాయం



దుస్తులు పంపిణీ చేస్తున్న హజరత్తయ్య గుప్తా తదితరులు



బాధితుడికి నగదు అందజేస్తున్న పాస్టర్లు

పాయకాపురం(విజయవాడరూరల్): లయన్స్ క్లబ్ విజయవాడ ఆధ్వర్యంలో గురువారం ప్రకాష్‌నగర్ ఈఎస్‌ఐ చర్చి ప్రాంగణంలో 50 మంది వరద బాధితులకు దుప్పట్లు, దిండ్లు, చాపలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రముఖ సామాజికవేత్త, లయన్స్ జిల్లా అంబాసిడర్ వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో సంభవించిన వరదల కారణంగా నష్టపోయిన వారికి సాయం అందించాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ వారు సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమని కొనియాడారు. క్లబ్ అధ్యక్షుడు పైడిమర్రి రామకృష్ణ, కార్యదర్శి ఎం.రవీంద్ర మాట్లాడుతూ.. త్వరలో సేవా మహోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఎన్వీ ఎల్ఎస్ గుప్తా, ప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు గురువారం గూడవల్లి, చుట్టుగుంట, తాడిగడప క్రీస్తు సంఘం ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీస్తు సంఘం పాస్టర్ దేవరపల్లి అశోక్ కుమార్, పాస్టర్ పిల్లల స్వామి మాట్లాడుతూ తాము నిరుపేద వరద బాధితులను గుర్తించి క్రీస్తు సంఘం ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు, నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న క్రీస్తు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ జి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించటంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు సత్తా చాటి నగర ఖ్యాతిని ఇనుమడింప చేయాలని శ్రీ చైతన్య కళాశాల డీన్ గుంటూరు హరిబాబు అన్నారు. ఏలూరు రోడ్డులోని శ్రీ చైతన్య కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు యు.శ్యాంకుమార్, బి.కృతిక, ఎం. భానుప్రియలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో తమ విద్యార్థులు బంగారు పతకం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావటం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. విజేతలను తైక్వాండో అసోసియేషన్ కృష్ణాజిల్లా కార్యదర్శి, కోచ్ ఎం.అంకమరావు, అసోసియేట్ ఏజీఎం కె.రంగారావు, శాప్ కోచ్ పి.గౌరీశంకర్, కళాశాల సిబ్బంది అభినందించారు.

శ్రీ విద్యా మంత్ర సాధన గ్రంథావిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యాపరులకు శ్రీ విద్యా మంత్ర సాధన ఉపయుక్త గ్రంథమని మారుతీ గ్యాస్ కంపెనీ అధినేత చెట్లపల్లి మారుతీప్రసన్న, శారదా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పొన్నలూరి లక్ష్మణరావు అన్నారు. స్థానిక లక్ష్మీనగర్ మారుతీగ్యాస్ కంపెనీలో పరమానంద క్రోవి పార్థసారథి రచించిన శ్రీ విద్యా మంత్ర సాధన గ్రంథావిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం జరిగింది. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని పార్థసారథితో కలిసి గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రోపదేశ విధానం, సంప్రదాయాలకు అతీతంగా పద్ధతులను ఈ గ్రంథంలో చక్కగా వివరించారని కొనియాడారు. నమ్మకం, మన్యుక్షములను వివరించటంతో పాటు అమ్మవారి నోము విధానాన్ని గ్రంథంలో పొందుపరచటం అభినందనీయమన్నారు. గ్రంథకర్త పార్థసారథి మాట్లాడుతూ.. శ్రీవిద్య గురించి ప్రతి ఒక్కరూ సులభంగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ గ్రంథాన్ని రచించానని తెలిపారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న గ్రంథకర్త పార్థసారథి, మారుతీప్రసన్న, లక్ష్మణరావు తదితరులు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక ప్రదర్శన చేసిన చిన్నారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గురువారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్‌లో శరన్నవ రాత్రుల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. శ్రీసాయిరామ్ నృత్య అకాడమీ భాగవతుల శ్రీనివాస శర్మ నృత్యబృందం చిన్నారులు చేసిన ప్రదర్శనలు ఆద్యంతం చూపరులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు తన్మయి, హరి, నవ్య, వేదశ్రీ, వర్షిత, చైతన్య దుర్గ తదితరులు మహిషాసుర మర్దినీ, మరకతమణిమాయ, శివాష్టకం ప్రదర్శనలు ఆహుతులను భక్తితన్మయత్వంలో ముంచెత్తాయి. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలు అందజేశారు. చిన్నారులను పలువురు అభినందించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీసెంట్ రోడ్డు పెద్దిబొట్ల వారి వీధిలోని ఎల్ఐసీ ఏజెంట్ గొట్టుముక్కల వరప్రసాద్ కార్యాలయంలో గురువారం విద్యుత్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో కార్యాలయంలోని ఎల్ఐసీకి బాండ్లు కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు.

సనాతన ధర్మం పేరుతో విద్వేషం

డీహెచ్‌పీఎస్ చర్చా వేదికలో వక్తల ఆగ్రహం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'రాజకీయ లబ్ధి కోసం సనాతన ధర్మం అంటూ కొన్ని రాజకీయ పక్షాలు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి. ఈ విషయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. అటువంటి పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలి' అని పలువురు వక్తలు పేర్కొన్నారు. దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో 'సనాతన ధర్మమా - సమసమాజ సందేశమా?' అనే అంశంపై విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం చర్చా వేదిక నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బౌద్ధ రచయిత బొర్రా గోవర్ధన్ మాట్లాడుతూ.. ఇటీవల కొందరు సనాతన ధర్మం అనే పదానికి కొత్త భాష్యం చెబుతున్నారని, దాని కోసం ఉద్యమాలు చేయాలని కొన్ని రాజకీయ పార్టీలు పిలుపునిస్తున్నాయన్నారు. భారత రాజ్యాంగం రూపొందించే సమయంలోనే సనాతన ధర్మం అని ప్రస్తావించకుండా సెక్యూలర్ అనే పదాన్ని చేర్చారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సమానమే... అనే నినాదంతో రాజ్యాంగాన్ని బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించారని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ కొంతమంది నాయకులు సనాతన ధర్మం అనేదానికి వక్రభాష్యం చెబుతూ హిందూ మతం మొత్తాన్ని అప్రతిష్ఠపాలు చేస్తున్నారన్నారు. కులాలు, మతాల వారీగా ప్రజలను, సమాజాన్ని విభజించాలని చూస్తున్న వారిని ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని కోరారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జీవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ చర్చా వేదికలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, బుద్ధభూమి వర్కింగ్ ఎడిటర్ గోలి సీతారామయ్య, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, ప్రజా సంఘాల నాయకులు అక్కినేని చంద్రరావు, పరిశపోగు రాజేష్, ఆంధ్ర మాల్యాద్రి, కాగితాల రాజశేఖర్, తాతారావు, జీవీ రాజు, అంకయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బౌద్ధ రచయిత బొర్రా గోవర్ధన్